తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

తూపాను ప్రభావం వల్ల మండలంలో సముద్ర తీరం ముందుకు రావడంతో పెదమైనవానిలంక, చినమైనలంక, బియ్యపుతిప్ప గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ నివసిస్తున్న ప్రజలను పరామర్శించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ అధికారులతో చర్చించి, ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని కోరారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసిరాజు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, వాతాడి ఉమా, తిరుమని సీతామాలక్ష్మి, ఒడుగు ఏసుబాబు పాల్గొన్నారు

భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

గొరగనమూడిలో ధర్నా నిర్వహిస్తున్న నేతలు

విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి - భీమవరం

ఇంధనం సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపెద్దని, వేస్తే ప్రజాప్రతిఘటన తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు స్పష్టం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పారని గుర్తు చేశారు. దానికి విరుద్ధంగా విద్యుత్ సంస్థల ఛార్జీల పెంపు ప్రతిపాదన అంగీకరించడానికి సిద్ధపడటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇంధనం సర్దుబాటు పేరుతో రూ.8,114 కోట్లు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.11,826 కోట్లు ప్రజలపై భారాలు వేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణల ఫలితమే విద్యుత్ భారాలని, ఈ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక కొరతతో ఉపాధి లేక, తెచ్చిన అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రజలపై భారాలు వేయొద్దని సూచించారు. గత విద్యుత్ పోరాట అనుభవం చంద్రబాబుకు ఉందని, అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ఛార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇ వర్మకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నేతలు ఎం.వైకుంఠం, డి.కళ్యాణి, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

పాలకోడేరు: ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రెండు దఫాలుగా రూ.20 వేల కోట్ల భారం మోపాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచాలని యోచనకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో గొరగనమూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని నియంత్రించకుండా విద్యుత్ ఛార్జీలు పెంచాలనుకోవడం దారుణమన్నారు. తక్షణం ప్రజలపై అదనపు భారాలు వేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, నాయకులు కొటికలపూడి శ్రీను, గోపాలరాజు, కె.వెంకన్న పాల్గొన్నారు.

నరసాపురంలో..

పాలకొల్లు: ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల పేరుతో విధించనున్న విద్యుత్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలని సిపిఎం నాయకులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇండోర్ విద్యుత్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజలు నిత్యావసరాల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీల భారాలు మోపడం దారుణమన్నారు. ప్రజలు కష్టాల నుండి గట్టెక్కిస్తారని కూటమికి అధికారం ఇస్తే సనాతన ధర్మం, లడ్డూ పేరుతో రచ్చ చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, నేతలు వై.అజయ్‌కుమార్, టి.గంగరాజు మాట్లాడగా చల్లా సోమేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, ఇరగారపు రాజు, టి.శ్రీనివాసరావు, పరశురాము తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న భారాలను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. శుక్రవారం స్థానిక కచేరి సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిర్రా నరసింహమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు, తలుపూరి బుల్లబ్బాయి, చదలవాడ చంటిబాబు, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, గుత్తుల రంగారావు, ఉన్నమట్ల దుర్గాప్రసాద్, ఎన్.కృష్ణ, ఎం.వీర్రాజు, టి.దుర్గాప్రసాద్, కె.బేజిమ్యాన్, యు.పద్మారావు, నాగరాజు, పి.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపే ఆలోచన మానుకోవాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. వేల్పూరులోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఉద్యోగి ఎ.లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో తిరునాధం వెంకటేశ్వరరావు, వాసా వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకష్ణ, కర్నాటపు నరసింహారావు, యండమూరి నాగేంద్ర, దున్నే నాగేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, వాసా పోసియ్య, తాళ్ల సత్యనారాయణ, విశ్వనాథం సుబ్బారావు, రుద్రాక్షల శ్రీనివాసు, కరేర్ల అర్జున్, బొక్కా మోహన్‌రావు పాల్గొన్నారు.

నరసాపురం: విద్యుత్ ఛార్జీల భారం మోపొద్దంటూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కరెంట్ ఆఫీస్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలనా కాలంలోనే భారాలు మోపడానికి సిద్ధపడటం బాధాకరమన్నారు. తక్షణం భారాల యోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు పొగాకు పూర్ణ, నోముల కొండ, బాతిరెడ్డి బాబ్జి, పున్నాన్ని అప్పలనాయుడు, బుడితి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచడం మానుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వి.ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వేల్పూరు రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖా కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు కూటమి గత ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి, నేడు పెంచడం ఏమిటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, వి.వెంకటేశ్వరరావు, బి.గణేష్, రాజు, బి.లక్ష్మీనారాయణ, పండు, అంబటి రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

ఆచంటలో..

సందిగ్ధంలో సాగునీటి సంఘాల ఎన్నికలు..!

16న నోటిఫికేషన్ విడుదల అర్ధాంతరంగా వాయిదా

నేటికీ ప్రకటించని సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలు

ఎన్నికల నిర్వహణలో వెనుకడుగుపై రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అట్టహాసంగా ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం మౌనం వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా సాగుతోంది. 16వ తేదీన విడుదల కావాల్సిన నోటిఫికేషన్‌ను అర్ధాంతరంగా వాయిదా వేశారు. ఎందుకు వాయిదా వేశారు.. తిరిగి ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తారో కనీస సమాచారం కూడా ఇవ్వని పరిస్థితి. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలను సాగదీస్తారా.. వెంటనే నిర్వహిస్తారా అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. విభజిత జిల్లాలవారీగా సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం చెప్పింది. దీంతో అందుకు సంబంధించిన ప్రక్రియను ఇరిగేషన్ అధికారులు పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌లో 92 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, మీడియం ఇరిగేషన్‌లో 11 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో 253 వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఎన్నికైన కమిటీలు తమ్మిలేరు, ఎర్రకాలువకు సంబంధించిన రెండు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌లో 98 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, మైనర్ ఇరిగేషన్‌లో 14 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. యూజర్స్ కమిటీలు 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. ఈ కమిటీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోనున్నాయి. జిల్లాలవారీగా కమిటీల విభజనకు సంబంధించిన ప్రక్రియ ముగిసింది. ఎన్నికల నోటిఫికేషన్ మాత్రం జారీ కాలేదు. దీంతో ఎన్నికల నిర్వహణపై పలు అనుమానాలు నెలకొన్నాయి.

ఓటర్ల జాబితా ఏది?

ఎన్నికల నిర్వహణకు విధివిధానాలు ఉంటాయి. ముందుగా ఓటర్ల జాబితా తయారు చేయాలి. దానిపై అభ్యంతరాలను స్వీకరించి తర్వాత తుదిజాబితా ప్రకటించాలి. ఓటర్ల జాబితా సిద్ధమైన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నిర్వహణ ప్రక్రియ వంటివి సాగుతాయి. సాగునీటి సంఘాల ఎన్నికలపై మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. ఇప్పటి వరకూ సాగునీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేయలేదు. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేయాల్సి ఉంది. వాటర్ యూజర్స్ కమిటీ పరిధిలో ఉన్న ఆయకట్టును పరిగణనలోకి తీసుకుని ఎంతమంది రైతులు ఉన్నారో తేల్చాలి. జాబితాను తయారు చేసి అభ్యంతరాలు స్వీకరించాలి. పొలాలు విక్రయించిన వారి ఓట్లు ఉంటే వాటిని తొలగించి ఆ పొలం కొనుగోలు చేసిన రైతుల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చాలి. ఒక యూజర్ కమిటీ పరిధిలో ఎక్కువగా అనుకుంటే వెయ్యి ఎకరాల వరకూ ఉండొచ్చని అంచనా. 150 మంది రైతులు వరకూ ఉండొచ్చు. ఒక్కో జిల్లాలో మేజర్, మైనర్ ఇరిగేషన్ వాటర్ యూజర్స్ కమిటీలు 112 వరకూ ఉన్నాయి. అయినప్పటికీ ఇప్పటి వరకూ ఓటర్ల జాబితా ఊసే లేకుండాపోయింది. ఓటర్ల జాబితా విడుదల చేయకుండా నోటిఫికేషన్ తేదీ ఏవిధంగా ప్రకటించారో కూడా అర్థం కావడం లేదు. ఓటర్ల జాబితా ప్రకటించకుండా సాగునీటి సంఘాల ఎన్నికలు ఏవిధంగా నిర్వహిస్తారో అయోమయంగా మారింది. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాపై ఇప్పటి వరకూ జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించడంగాని, ప్రకటన విడుదల వంటివి కూడా చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తారా.. లేక మమ అన్పించేస్తారా అనే చర్చ సాగుతోంది. సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను వెంటనే విడుదల చేయడంతోపాటు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

సాంకేతికతతో మెరుగైన సేవలందించాలి

మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ నాగరాణి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

జిల్లాలోని పట్టణాల్లో సాంకేతికతను ఉపయోగించి మెరుగైన సేవలందించేందుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో ఆమె సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. పట్టణాల్లో మేలైన సర్వీసులను అందించేందుకు సాంకేతికతను ఎలా వినియోగించుకోవచ్చో ఆలోచించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లోని మున్సిపాల్టీల్లో సాంకేతికతను వినియోగిస్తున్న తీరును తెలుసుకుని వాటిలో ఉత్తమంగా ఉన్న వాటిని మన జిల్లాలో అమలు చేయాలని సూచించారు. పట్టణాల్లో స్వచ్ఛతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పొడి, తడి చెత్త వేరు చేసి మాత్రమే చెత్తను సేకరించాలని ఆదేశించారు. పట్టణాల్లో డంపింగ్ అనేది ప్రధాన సమస్యగా మారిందని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. భీమవరం పట్టణంలో గుర్తించిన 11 పార్కులను వాటికి ఉన్న స్థలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా అభివృద్ధి చేయాలన్నారు. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్స్ స్పోర్ట్స్ వంటి వాటిని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. 21వ వార్డులో ఉన్న ఎడ్వర్డ్ ట్యాంక్ పార్క్ వద్ద బోటింగ్ ఏర్పాటుకు పరిశీలించాలన్నారు. ఇంటి, నీటి పన్ను తదితర పన్నుల వసూళ్లకు ముందుగానే నోటీసులను అందజేయడం, టెలిఫోన్ సందేశాలను పంపడం చేయాలని సూచించారు. పన్నులను సకాలంలో వసూలు చేసి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏదైనా ప్రాంతంలో అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వెల్ఫేర్ సెక్రటరీ సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి అందజేయాలని ఆదేశించారు. మెప్మా కొత్త గ్రూపులను ఏర్పాటు చేయడంతోపాటు, యానాది కుటుంబాలకు చెందిన మహిళలను కూడా గ్రూపుల్లో చేర్పించాలని సూచించారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో వేల్పూరులో నిర్వహిస్తున్న మహిళా మార్టును తణుకు పట్టణానికి మార్పు చేయాలని ఆదేశించారు. పిఎం స్వానిధి రుణాల మంజూరుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రరెడ్డి (భీమవరం), ఎం.యేసుబాబు (తాడేపల్లిగూడెం), టి.రామ్‌కుమార్ (తణుకు), బి.విజయసరోహి (పాలకొల్లు), ఎం.అంజయ్య (నరసాపురం), జి.కృష్ణమోహన్ (ఆకివీడు), భీమవరం మున్సిపల్ డిఇ త్రినాధరావు, టౌన్ ప్లానింగ్ అధికారి ఎం.శ్రీలక్ష్మి, డిఇలు, ఎఇలు, టిపిఒలు, ఎసిటిలు, ఎఒలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అనువైన ప్రదేశాలను గుర్తించి కార్యాచరణను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె టూరిజం అధికారులతో జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై సమీక్షించారు. జిల్లా ప్రజలను ఆహ్లాదపర్చేలా బోటింగ్, వాటర్‌ఫాల్స్, జిప్‌రైడర్, రోబోటిక్ పౌంటైన్స్ తదితరాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి తీరప్రాంతంలో చేపట్టాల్సిన ప్రాజెక్టులను గుర్తించాలన్నారు. కార్తీకమాసంలో సముద్ర స్నానాలకు వచ్చే మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదుల ఏర్పాటు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు, సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్‌రావు, జిల్లా టూరిజం అధికారి పట్టాభి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు రూపుమాపేందుకు కృషి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి సుజాతరాణి

ప్రజాశక్తి - భీమవరం

బాల్య వివాహాలు రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి బి.సుజాతరాణి అన్నారు. శుక్రవారం ఐఎంఎ హాల్లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, డిఎండ్‌హెచ్‌ఒ డి.మహేశ్వరరావు సంయుక్తంగా సమావేశమై బాల్య వివాహాలు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, ఎనీమియా, మాతా శిశు మరణాలు తదితర అంశాలపై మెడికల్ అధికారులు, సిడిపిఒలు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి మాట్లాడుతూ విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నంబరు 1098ను మరింత విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ హైరిస్క్ ప్రెగ్నెన్సీ లను, రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించి సరైన పోషకాహారం అందేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనికేషన్ అధికారిని సుధాలక్ష్మి, బాలల సంరక్షణ అధికారి రాజేష్, జిల్లాలోని మెడికల్ అధికారులు, సిడిపిఒలు, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, వైద్య శాఖ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి - ఆచంట

టెక్నికల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడే మోజెష్ డిమాండ్ చేశారు. మండలంలోని తూర్పుపాలెం పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో టెక్నికల్ అసిస్టెంట్ బాబూరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోజెష్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నైపుణ్యం లేని పనులతో ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం, పనుల్లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులు కల్పించి వారిని ఆదుకోవాలన్నారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తీసే పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బొక్కా నాగేశ్వరరావు, కేతా కృష్ణారావు, కె.సుబ్బారావు, వీరయ్య, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇరుపక్షాలు అంగీకరిస్తేనే పరిష్కారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వీరవాసరం

భూ విస్తరణ హెచ్చుతగ్గుల్లో ఇరుపక్షాలు అంగీకరిస్తేనే సమస్య పరిష్కరించగలమని ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ సదస్సులు గురువారం తోకలపూడి, పంజా వేమవరంలో తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సదస్సులో పలువురు భూ యజమానులు రీ సర్వే అనంతరం తమ భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు వచ్చాయంటూ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ సరిహద్దుదారుడైన భూ యజమానులు సామరస్య పూర్వకంగా వారి సమస్యను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలన్నారు. అలాగే వారిరువురిని ఒప్పించే విధంగా మండల రెవెన్యూ అధికారులు కృషిచేసి వారి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే కొంతమంది రైతులు రీసర్వే వల్ల సరిహద్దు రైతుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజులు దాఖలా వాస్తవాలు పరిశీలించి తమ భూములను రెవెన్యూ అధికారులు నిర్ధారించాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో వివాదాలు కొనసాగే అవకాశం ఉందని అన్నారు. 18 అర్జీలు స్వీకరించినట్లు డిటి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపి సుబ్బారావు, ఆర్‌ఐ రోజ్ వెల్, రెవెన్యూ, సర్వేయర్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో పక్షపాతమేలా..!

రాయలం డ్రెయినేజీపై చిరువ్యాపారుల బడ్డీల తొలగింపు - బడా పచ్చళ్ల దుకాణం జోలుకెళ్లని అధికారులు?

ఆక్రమణలను తొలగిస్తున్న డ్రెయినేజీ అధికారులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాయలం డ్రెయినేజీ వెంబడి ఉన్న ఆక్రమణల తొలగింపులో అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రాయలం డ్రెయినేజీ వెంబడి ఉన్న ఆక్రమణలతోపాటు షాపులను తొలగించారు. ఈ విషయంలో కచ్చితంగా వారిని అభినందించాల్సిందే. అయితే ఇదే డ్రెయినేజీని ఆక్రమించి ఒక వ్యక్తి దర్జాగా పచ్చళ్ల వ్యాపారం సాగిస్తున్నాడు. వచ్చిన వినియోగదారుల సౌకర్యార్థం డ్రెయినేజీకి ఆనుకుని ఒక బాత్రూమ్ కూడా నిర్మించారు. అయినా అధికారులు మాత్రం ఆక్రమణల తొలగింపులోయ దీనిజోలికి వెళ్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సామాన్యుల బడ్డీ కొట్లు, తోపుడు బళ్లను ట్రాక్టర్‌పై తరలించేసిన అధికారులు ఇక్కడ పచ్చళ్ల వ్యాపార దుకాణాన్ని ఎందుకు ఖాళీ చేయించట్లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. సామాన్యులకు ఒక న్యాయం, బడా బాబులకు ఒక న్యాయమా అని వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

డ్రెయినేజీ స్థలంలో ఉన్న పచ్చళ్ల వ్యాపారి షెడ్డు

వాస్తవాలేమిటో పరిశీలించండి

అధికారులకు ఎంఎల్‌ఎ అంజిబాబు ఆదేశం - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వీరవాసరం

సీసీ రోడ్డుపై మళ్లీ రోడ్లు వేసేందుకు సిద్ధం' శీర్షికన ఈ నెల 17న ప్రజాశక్తిలో వచ్చిన ప్రచురితమైన కథనంపై భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్పందించారు. వాస్తవాలు ఏమిటనేది పరిశీలించాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్‌లను శుక్రవారం ఆదేశించారు. మొత్తం ఎనిమిది రహదారుల వెంబడి సిమెంట్ రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోగా వాటిలో కొన్ని సీసీ రోడ్లపై మళ్లీ రోడ్లు వేయనున్నట్లు గుర్తించారు. అయితే గతంలో ఎప్పుడో వేసిన రోడ్లు కావడంతో వాటిపై రోడ్లు వేయాలని ఎంపిటిసి విజయలక్ష్మి కోరుతున్నారు. వాస్తవానికి స్థానికుల నిర్లక్ష్యం, రోడ్ల అంచుల వెంబడి ఆక్రమణలతో ఎత్తు చేసుకోవడంతో ఆ రోడ్లన్నీ పల్లంగా మారడంతో వర్షపు నీరు రోడ్లపైనే పేరుకుపోతుంది. దీంతో ఆ రోడ్లన్నీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఆ రోడ్ల వెంబడి డ్రెయినేజీ సదుపాయం కల్పించకుండా మళ్లీ వాటిపైనే రోడ్లు వేస్తే ప్రస్తుత పరిస్థితే పునరావృతమయ్యే అవకాశం అక్కడ పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. ఇదే పరిస్థితి గ్రామంలో అన్ని రోడ్ల వెంబడి నెలకొంది. సీసీ రోడ్లు పల్లంగా మారాయని వాటిపైనే మరోసారి సీసీ రోడ్లు వేసుకుంటూ పోతే అసలు స్వాతంత్రం వచ్చిన తర్వాత ఒక తట్ట కంకర కూడా వేయని మట్టి రహదారులను పట్టించుకునేదెవరని మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే గ్రామసభ ఔన్నత్యాన్ని విస్మరించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ప్రణాళిక లేని అభివృద్ధి వల్ల ఉపయోగం ఏమిటనే విమర్శలు విన్పిస్తున్నాయి.

వీరవాసరం రోడ్లును పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎంపిపి బృందం

ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి

బాల్య వివాహాలపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని విస్సాకోడేరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. విస్సాకోడేరు ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సూపర్‌వైజర్ సూర్యకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. బాల్య వివాహాలు ఆరోగ్యపరంగా శ్రేయస్కరం కాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గణపవరం :గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండకుండా బాల్య వివాహాలు జరిపితే ప్రభుత్వం పదేళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తుందని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.రూపాదేవి అన్నారు. శుక్రవారం సరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై జరిగిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం కిశోర బాలికలకు పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, కిశోర బాలికలు, ఎఎన్ఎంలు పి.సౌభాగ్యలక్ష్మి, నాగమణి, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్ఎం భవానీప్రసాద్ రాయపూడి విద్యార్థులచే బాల్య వివాహాలు రద్దు చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ నిమిషానికి ముగ్గురు బాలికలు బలవంతంగా పెళ్లి బంధంలో చిక్కుకుంటున్నారన్నారు. బాల్యవివాహాలు భవితకు అవరోధాలన్నారు. ప్రస్తుతం 21 సంవత్సరాలు అమ్మాయిలకు, 25 సంవత్సరాలు అబ్బాయిలకు వివాహం చేయాలని చట్టం చెబుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, భవాని దుర్గ, శశికళ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

గణపవరం : బాల్య వివాహాలను అరికట్టాలని శుక్రవారం గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమ్మిడి హసీనాబేగం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హసీనా బేగం మాట్లాడుతూ బాల్యవివాహాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎవిఎస్ఎస్.మూర్తి, జి.దేవదాసు, ఎస్సైద రాణి పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో కళలు ఒక భాగం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారతీయ సంస్కృతిలో కళలు ఒక భాగమని, 64 కళల్లో నృత్యం ఒకటని, అటువంటి కళలలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని కెజిఆర్ఎల్ కళాశాల కార్యదర్శి మెంటే రామమనోహర్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సంగీత నృత్య సమ్మేళనంలో భీమవరం నృత్య కళాకారులు చిక్కడపల్లి త్యాగరాజ గాన సభలో విశేష ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కెజిఆర్ఎల్ కళాశాలలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కెజిఆర్ఎల్ కళాశాల బి ఫార్మసీ విద్యార్థి కడలి భానుశ్రీ నృత్యంలో జాతీయ అవార్డును సాధించారని, ఉదకమండలం సంవత్సరం నుంచి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారని, ఈ నెల 13న తెలంగాణ నృత్య అకాడమి నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం 6 గురు సాధించారని, 9 జిల్లాల నుంచి వందలాది మంది కళాకారులు పాల్గొనగా వారిలో భీమవరం నుంచి 6గురు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచడం అభినందించి సత్కరించడం జరిగిందని అన్నారు.

3 ప్రాంతాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పెనుమంట్ర 1, ఆలమూరు, మార్టేరు - 2 ఆధార్ కేంద్రాల్లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ మొబైల్ క్యాంపులు జరుగుతాయని స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వివిఎస్ఎ.శర్మ ఒక్కడ తెలిపారు. ఈ నెలలో 22, 23 తేదీల్లో మాముడూరు, ఆలమూరు, సత్యవరం గ్రామాలకు, 24, 25 తేదీల్లో మల్లిపూడి, నెలమూరు, నెగ్గిపూడి గ్రామాలకు ఈ సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు అవసరమైనవారు తగు పత్రాలలిచ్చి, ఈ సేవలు పొందాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఐటిఐలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీయర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆచంట గవర్నమెంట్ ఐటిఐ కాలేజీలో ఈ నెల 22వ తేదీ మంగళవారం ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ ఐవి సత్యనారాయణ రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ముత్తూట్ ఫైనాన్స్ డర్బిన్ ఎస్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్ వంటి కంపెనీల్లో కస్టమర్ ఎగ్జిక్యూటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ లోన్ ఆఫీసర్, ఆపరేటర్ మొదలైన ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాల వయసు కలిగిన పురుషులు, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ కింది లింకులో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. https:/ /tinyurl. Com /placement -cell-wg. మరిన్ని వివరాల కోసం 6304922617ను సంప్రదించాలని కోరారు.

నత్తారామేశ్వరంలో రతన్ టాటా కాంస్య విగ్రహం తయారీ

ప్రజాశక్తి - పెనుమంట్ర


రతన్ టాటా విగ్రహం చెక్కుతున్న శిల్పి కరుణాకర్ వడయార్

నత్తా రామేశ్వరం గ్రామంలోని ఎకె ఆర్ట్స్ శిల్పా కేంద్రంలో ఇటీవల మరణించిన దేశ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా విగ్రహం రూపకల్పన జరుగుతోంది. ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు చెప్పిన మేరకు సుమారు ఏడున్నర టన్నుల కాంస్య విగ్రహం నిర్మిస్తున్నట్టు ప్రముఖ శిల్పి పెనుగొండ కరుణాకర్ ఉడయార్ తెలిపారు. నమూనా విగ్రహం అనంతరం అసలు విగ్రహం చేస్తామని ఆయన తెలిపారు. పలువురు ఈ విగ్రహం చూసి ఆయనను అభినందించారు.

నేడు మార్టేరు ఫారంలో టిఅండ్‌వి సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 19వ తేదీ శనివారం శిక్షణ, వీక్షణ (టిఅండ్‌వి) కార్యక్రమం జరుగుతుందని ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి, వివిధ డివిజన్ల ఎడిఎలు, మండల వ్యవసాయ అధికారులు హాజరై జిల్లాలోని ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను గురించి చర్చించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన డిఇ

నరసాపురం:నరసాపురం మున్సిపల్ డిఇగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్ శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, కమిషనర్ ఎం.అంజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటివరకూ పనిచేసిన ఆర్.రమేష్‌బాబు విజయవాడకు బదిలీ అయ్యారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని సిఐటియు వీరవాసరం మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం వీరవాసరంలో జరిగిన మండల కమిటీ సమావేశానికి డి.వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో భవన నిర్మాణ, రైస్‌మిల్, చేపల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఆటో, పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని, వారందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్లో ఉన్నాయని, వెంటనే వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి పి.నాగరత్నం మాట్లాడారు. కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్తిబాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి, డ్వాక్రా యానిమేటర్ల సంఘం నాయకులు సోనీ, ఆశాలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం : ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభల ద్వారా భూములకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. గొంది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో చేపట్టిన గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు 40 పైగా భూ సమస్యలతో కూడిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ టి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో జరిగిన చోరీ కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు అడిషనల్ ఎస్‌పి ఎం.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురంలో పిల్లిపేటకు చెందిన రవ్వ ఉమా మహేశ్వరి ఈ నెల ఒకటో తేదీన రాత్రి 108 అంబులెన్స్ నైట్ డ్యూటీకి వెళ్లారు. మరుసటిరోజు తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉన్న 122 గ్రాములు బంగారం, 100 గ్రాములు వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం చింతాడ గరువు గ్రామానికి చెందిన మండల నాగ భాస్కరరావును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 71.47 గ్రాములు బంగారం రికవరీ చేసినట్లు తెలిపారు. అతనిపై నరసాపురం సబ్ డివిజన్లో పాలకొల్లు టౌన్, పాలకొల్లు రూరల్, భీమవరం టూ టౌన్లో 15 కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో ఇంకొక ముద్దాయిని పట్టుకోవాల్సి ఉందన్నారు. కేసును ఛేదించడంలో నరసాపురం సిఐ బి.యాదగిరి, ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, ఎస్ఎన్.ముత్యాలరావు, ఐడి పార్టీ సిబ్బంది జి.శీను బాబు, కె.వేణుగోపాలరావు సహకరించారని వీరికి రివార్డు నిమిత్తం ఎస్‌పి సిఫారసు చేస్తామన్నారు.

యాత్రికులకు ఇబ్బంది లేకుండా చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసి రాజు

కార్తీకమాసం సందర్భంగా పేరుపాలెం బీచ్‌కి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ దాసి రాజు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు బీచ్‌కు వస్తారన్నారు. సముద్రంలోలోకి వెళ్లకుండా ఏర్పాటు చేయాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు కార్తీక మాసం ముగిసే వరకూ దగ్గరుండి ఏర్పాట్లు చూడాలన్నారు. బీచ్‌లో తీసుకునే చర్యల గురించి వివిధ శాఖల అధికారుల ప్రణాళికను ఆర్‌డిఒకు వివరించారు. నరసాపురం డిపో నుంచి బీచ్ వరకూ రెగ్యులర్‌గా సర్వీసులు నడపాలని, యాత్రికులకు ఎక్కువగా వచ్చే సెలవు రోజు అదనపు బస్సులు నడపాలని ఆదేశించారు. కార్తీకమాసం ముగిసే వరకూ బీచ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కలిసి అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

ఆపరేషన్ అయిన వారికి కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంఎల్ఎ

కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ కనుమూరు రఘురామ కృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరులో శుక్రవారం ఉచిత కంటి, దంత మెగా వైద్య శిబిరాలను నిర్వహించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్, ఆకివీడు ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి, భీమవరం విష్ణుదంత వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాలను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ శిబిరానికి 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి, దంత వైద్య మెగా శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్యసేవలందించేలా కృషి చేస్తున్న దాట్ల శ్రీదేవీ ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకట రామరాజును పలువురు వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాల కృష్ణంరాజు, గ్రామ సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, మాజీ జెడ్‌పిటిసి అడ్డాల పద్మావతి, కోరా రామ్మూర్తి, సుంకర కాశీ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలను తగ్గించాలని, పనుల్లేక పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు విమర్శించారు. సిపిఎం కూరగాయలు మార్కెట్ శాఖా 8వ మహాసభ శుక్రవారం స్థానిక సీతారాంపేట పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నక్కా ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ సీనియర్ నాయకులు నక్కా ఆనందరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ నాయకులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను హాజరయ్యారు. మహాసభను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయలు ధరలు తగ్గించాలన్నారు. ఇసుక సరఫరా సరిగ్గా లేకపోవడం వల్ల పనులు లేక అవస్థలు పడుతున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్రి అప్పారావు, నక్కా ఆనందరావు, సభ్యులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పంచాయతీలు పట్టుకొమ్మలని చెపుతూనే పంచాయతీలకు ఏ అధికారమూ లేకుండా చేస్తున్నారని సిపిఎం శ్రీరాంపురం గ్రామ శాఖ మహాసభ విమర్శించింది. శ్రీరామపురం గ్రామం సదాశివరావుపేటలో సిపిఎం శ్రీరాంపురం శాఖ గ్రామ మహాసభల సందర్భంగా ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు కోడి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. ఇటీవల అమరులైన అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఆర్ఎస్‌కు, పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళు లర్పించారు. మహాసభలు తోటే శుభకర అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. శాఖా కార్యదర్శిగా ఇంజేటి శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

23న సెలబ్రెటీ షోను అడ్డుకుంటాం : వాసు

ప్రభాస్ ఫ్యాన్స్ పేరుతో అక్రమ వసూళ్లను సహించబోం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసు

ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రభాస్ పేరిట అక్రమంగా వసూళ్లకు పాల్పడుతూ భీమవరం కుముదవల్లి రోడ్డులో నిర్వహిస్తున్న సెలబ్రెటీ షోను అడ్డుకుంటామని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉండి వాసు అన్నారు. శుక్రవారం భీమవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 23 ఏళ్లుగా ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కొత్తగా ఎక్కడ నుంచో వచ్చిన వారు పుట్టినరోజు వేడుకలంటూ భీమవరంలో పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులమే ఇప్పటి వరకు సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఆదరాభిమానాలు పొందామని, ఈ ఈవెంట్ పేరుతో వసూళ్లు చేస్తే ప్రభాస్ పేరును పాడుచేసినట్లు అవుతుందన్నారు. వారు 23న ఈవెంట్ నిర్వహిస్తే తప్పకుండా అడ్డుకుంటామని వాసు హెచ్చరించారు. కార్యక్రమంలో పిచ్చేటి ప్రసాద్, కె.జగదీష్, మహ్మద్ ఉమర్, నాని, కేశవ, పి.తేజ, వెంకటేష్, బి.శేష పాల్గొన్నారు.

నేడు పోడూరు, పాలకొల్లులో మంత్రి నిమ్మల పర్యటన

పాలకొల్లు:మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 19వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు పోడూరు మండలం జిన్నూరులో, 10.30లకు మట్టపర్రులో పర్యటిస్తారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు పాలకొల్లు పట్టణంలో హాస్పిటల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.00 గంటలకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి కార్యక్రమం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో పాల్గొంటారు. సాయంత్రం కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

అభివృద్ధికి సహకరించండి : ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - పెంటపాడు

అభివృద్ధి విషయంలో ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి సహకరించాలని, ఏ స్థాయిలో అవినీతి జరిగినా ప్రజలు నిలదీయాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఆరుళ్ల, పడమర విప్పర్రు గ్రామంలో శుక్రవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ పడమర విప్పర్రు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సాక్షిగా విప్పరు గ్రామాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ముందు వరుసలో నిలబెడతానని హామీ ఇచ్చారు. గ్రామంలో గ్రూపు తగాదాలతో అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి హైమావతి, పసల అచ్యుతం, పుల్లా బాబీ, గంటా సుబ్రహ్మణ్యం, పసుపులేటి అమ్మిరాజు, పాలూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం : ఈ నెల 19న శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ నెల 19న రాజుగారితోట, సీతారాంపురంసౌత్, చామకూరిపాలెం, ఎల్‌బిచర్ల, పెదమైనవానిలంక, మల్లవరం పెదలంక, కొప్పర్రు, కె.బేతపూడి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ఎంఎల్ఎ శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు.

కుక్కలవారితోటలో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

అన్నదానంలో పాల్గొన్న జనం

మొగల్తూరు పంచా యతీ పరిధి కుక్కలవారితోటలో శుక్రవారం భారీ అన్న సమారాధన చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమాధానం లో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

అన్నదానానికి విరాళాల సేకరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గునుపూడిలోని సోమేశ్వర జనార్ధనస్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసే నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు ఇచ్చే దాతలు దేవస్థాన అధికారులను సంప్రదించాలని ఆలయ ఇఒ రామకృష్ణంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విరాళాలు ఇచ్చే దాతలు కార్యనిర్వహణాధికారి 9963752144, 9491009678, 9052431456 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు : జెసి

ప్రజాశక్తి - కాళ్ల

రీసర్వే సమస్యలపై రైతులు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలో రీ సర్వే గ్రామ సభను జక్కరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ గ్రామ సభలో 11 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ సుందర్ సింగ్, ఎడి సర్వేయర్ జఘువా, డిఐ ఒఎస్ మల్లికార్జునరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఉండి:భూ రీసర్వేపై శుక్రవారం నుంచి ప్రారంభించిన గ్రామసభలోంల 28 అర్జీలు దాఖలైనట్లు తహాశీల్దార్ కావడి నాగార్జున తెలిపారు. కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలనుద్దేశించి తహాశీల్దార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రీసర్వేలో కొంతమంది భూములు ఆన్‌లైన్ చేసేటప్పుడు కొన్ని అవకతవకలు జరిగాయని, తమ దృష్టికి వచ్చిందని వీటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ గ్రామ పంచాయతీ సర్పంచి కొండవీటి సాంబశివరావు, కలిసిపూడి సర్పంచి కె.జానకి శ్రీనివాస్, జిల్లా డిఐఒఎస్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భీమవరం పురపాలక సంఘం

'e' ప్రొక్యూర్మెంట్ నోటిఫికేషన్

ఆర్.ఒ.సి. నెం. 12(1744533)/2019-డి.భి ది. 18-10-2024

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో టెండరు నోటీసు నెం.15(1-4)/BHI/General/2024-25/E2 షార్టు టెండరు నోటీసు నె.15(5-8)BHI/General/2024-25/E21/E2 లోని జనరల్ ఫండ్స్ నుండి 5 పనులకు సంబంధించి 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నె. 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు మార్కెట్టు E2W.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప॥గో॥జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం

నీరు నిల్వ లేకుండా చూడాలి

భీమవరం టౌన్:లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు చేరి ప్రజలు ఆరోగ్యం పాలవుతారని, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి ఆదేశించారు. శుక్రవారం 28వ వార్డులోని పలుప్రాంతాలను ఆయన పరిశీలించారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, కొవ్వలి గ్రామ కాపరస్తులు నా క్లయింటు అయిన చంపాటి నరశింహరాజు గారి కుమారుడు చంపాటి రామరాజు గార్కి గల **8328/2014** మరియు **1230/2009** అను ఈ రెండు దస్తావేజులు ది.10-10-2024వ తేదీన కొవ్వలి నుండి ఏలూరు వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ సత్రంపాడు మార్గంమధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఎ. మణికుమార్
అడ్వకేట్
వట్లూరు, ఏలూరు
సెల్: 94416 40035

సర్టిఫికెట్లు పోయినవి

నూజివీడు పట్టణ కాపురస్తులు, డో.నెం.24/58(ఎ), కోనేరుపేట, వాస్తవ్యులు పురాణం శ్యామ్‌కుమార్ గారి కుమారుడు శ్రీకాంత్ తెలియజేయునది ఏమనగా..,

నేను ది.25-09-2024వ తేదీ సోమవారం ఉదయం 11:00 గంటలకు నూజివీడులోని రాజీవ్ సర్కిల్ నుండి కోనేరుపేటలోని మా ఇంటికి బైక్ పై వెళ్ళుతుండగా నా బైకుపై ఉన్న కవర్‌లో నాతాలూకు ఇంటర్మీడియట్ మార్కులు లిస్టు, లాంగ్ మెమో ఉన్న కవరుతో సహా జారి పడిపోయినది. నూజివీడు మరియు పరిసర ప్రాంత ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఆ సర్టిఫికెట్ ఎవరికైనా దొరికిన ఎడల నాకు గాని లేదా నూజివీడు పట్టణ పోలీసు వార్కి గాని అందజేయగలరు.

పురాణం శ్రీకాంత్
తండ్రి: శ్యామ్ కుమార్, కోనేరుపేట,
నూజివీడు. సెల్: 80742 12125

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 29/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ....వాది
అండ్
అంగులూరి సాయిసోధన్ వగైరా ....ప్రతివాదులు
టూ:
2వ ప్రతివాది:- మీనాక్షి లలిత శివ జ్యోతి, భర్త: వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1-52-23/1, RTC కాంప్లెక్స్ వెనుక, సిపాయిపేట, తాడేపల్లిగూడెం.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంక్ వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 1వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది. 25-10-2024 తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 25-10-2024** సం. తేదిన **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం, B.Com, B.L.,
అడ్వకేట్, నరసాపురం, ప॥గో॥జిల్లా
స్టాండింగ్ కౌన్సెల్ ఫర్ బ్యాంక్ ఆఫ్ బరోడా
నరసాపురం నరసాపురం బ్రాంచ్
ది: 03-10-2024

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 33/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ....వాది
అండ్
తోట దుర్గా ప్రసాద్ వగైరా ....ప్రతివాదులు
టూ:
1వ ప్రతివాది:- తోట దుర్గా ప్రసాద్, తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం. 14-46-19/1, ఉంగరాలవారి వీధి, రామారావుపేట, తాడేపల్లిగూడెం.
2వ ప్రతివాది:- తోట దుర్గాదేవి, భర్త: దుర్గా ప్రసాద్, డోర్ నెం. 14-46-19/1, ఉంగరాలవారి వీధి, రామారావుపేట, తాడేపల్లిగూడెం.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంక్ వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన శ్రీ నరసాపురం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది. 07-11-2024 తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాదులు అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 07-11-2024** సం. తేదిన **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం, B.Com, B.L.,
అడ్వకేట్, నరసాపురం, ప॥గో॥జిల్లా
స్టాండింగ్ కౌన్సెల్ ఫర్ బ్యాంక్ ఆఫ్ బరోడా
నరసాపురం నరసాపురం బ్రాంచ్
ది: 03-10-2024

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి

రి.క. నెం.44/2024 **బహిరంగ వేలం ప్రకటన** తేది.18-10-2024

ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖల ఐటమ్ లకు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది. 25-10-2024వ తేది శుక్రవారం ఉదయం 11.00 గం॥లకు ఆగిరిపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయితీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం వేయబడును. బహిరంగ వేలం నందు పాల్గొనదలచిన వారు సంబందిత తహసీల్దారు వారి వద్ద నుండి పొందిన రూ. 30,00,000/- లకు సాల్వేన్సి ధృవీకరణ మరియు షెడ్యూల్ నందు తెలిపిన ధరావతులు చెల్లించి హెచ్చు పాట మొత్తము ఏక మొత్తము లో వెంటనే చెల్లించు విధానము ననుసరించి బహిరంగ వేలం పాటలలో పాల్గొనవలయును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలిసికొనవచ్చును.

వరుస నెం	అయిటమ్ వివరము	చెల్లించవలసిన ధరావత్తు	కాలపరిమితి
1	కురివిడి చెరువు	10000/-	2024-2026
2	ఫీడరు చెరువు	10000/-	2024-2026

సం/- **పంచాయతి కార్యదర్శి**
గ్రామపంచాయతి ఆగిరిపల్లి